

తెలంగాణ జట్టు జైత్రయాత్ర

ఆల్ ఇండియా టీ–20 మహిళా క్రికెట్ టోర్నీలో తెలంగాణ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది.

10లో



పరిపాలన దిశగా అడుగులు

అణగారిన వర్గాల వారు పార్టీల జెండాలు మోయడం మానేసి పరిపాలన దిశగా అడుగులు వేయాలని మంద కృష్ణ పిలుపునిచ్చారు.

10లో

గరిష్టం / కనిష్టం

44° / 27°

వాతావరణం

జిల్లాలో ఆదివారం ఉష్ణోగ్రతలు గరిష్ట స్థాయిలో నమోదవుతాయి. మధ్యాహ్నం వడగాలుల ప్రభావం ఉంటుంది.

న్యూస్‌రీల్

శ్రీవారికి ప్రత్యేక పూజలు



భక్తులకు ఆశీర్వచనం అందజేస్తున్న అర్చకులు

ఎర్రుపాలెం: మండలంలోని జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామివారి ఆలయంలో శనివారం స్వామి వారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీవారి పాదానికి పంచామృతాలతో అభిషేకం చేశాక, స్వామి, అమ్మ వార్లను ప్రత్యేకంగా అలంకరించారు. ఆతర్వాత ఏపీ, తెలంగాణ నుంచి హాజరైన భక్తుల సమక్షాన అర్చకులు వెంకట సుబ్రహ్మణ్యశాస్త్రి నిత్యకల్యాణం జరిపించగా, శ్రీవారికి పల్లకీ సేవ చేశారు. ఈఓ జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, ఉద్యోగులు శ్రీనివాస్, విజయకుమారి తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ప్రాక్టికల్ పరీక్షలు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ అడ్వాన్స్‌డ్ సప్లమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు(జనరల్, ఒకేషనల్ విభాగాలు) సోమవారం నుంచి 9వ తేదీ వరకు జరగనున్నాయి. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ఉదయం 9 నుంచి 12గంటల వరకు, మధ్యాహ్నం 2నుంచి 5గంటల వరకు పరీక్షలు జరుగుతాయని, విద్యార్థులు తాము చదివిన కళాశాలల్లో హాల్‌టికెట్లు తీసుకొని పరీక్షకు హాజరు కావాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించండి

'బడిబాట'లో డీఈఓ సోమశేఖరశర్మ



కరపత్రాలు పంపిణీ చేస్తున్న డీఈఓ శర్మ, తదితరులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన వసతులు కల్పించటంతో పాటు నాణ్యమైన విద్యనందిస్తున్న నేపథ్యాన తల్లిదండ్రులు తమ పిల్లలను చేర్పించాలని డీఈఓ సోమశేఖరశర్మ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచడమే లక్ష్యంగా చేపట్టిన బడిబాట కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. ఈసందర్భంగా ఖమ్మం రిక్కాబజార్ పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి రాజీవ్ స్వగృహ తదితర ప్రాంతాల్లో డీఈఓ సోమశేఖరశర్మ పర్యటించారు. ప్రభుత్వ పాఠశాలల్లో కల్పిస్తున్న సౌకర్యాలతో కూడిన కరపత్రాలు పంపిణీ చేశారు. ఖమ్మం అర్బన్ ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల హెచ్‌ఎం కనపర్తి వెంకటేశ్వర్లు, ఎస్‌ఎంసీ చైర్మన్ రాజేశ్వరి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తెరుచుకోని రేషన్ షాపులు

ఖమ్మం సహకారనగర్: సమస్యలు పరిష్కరించాలనే డిమాండ్‌తో జిల్లా వ్యాప్తంగా రేషన్ డీలర్లు శనివారం షాపులు తెరవలేదని డీలర్ల సంఘం ప్రధాన కార్యదర్శి జానీమియా తెలిపారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె చేస్తామని ప్రభుత్వానికి విన్నవించగా... స్పందించిన పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఈనెల 1వ తేదీలోగా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు. అయితే, హామీ నెరవేరకపోవడంతో జిల్లాలో 21మండలాల్లోని 748దుకాణాలు తెరవలేదని తెలిపారు.

సివిల్స్ ర్యాంకర్‌కు కలెక్టర్ అభినందన



మనోజ్‌ను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్, పక్కన కుటుంబ సభ్యులు, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల విడుదలైన సివిల్ సర్వీసెస్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 559 ర్యాంకు సాధించిన కొణిజర్ల మండలం అనంతారం గ్రామానికి చెందిన ఇనుకొండ ఈశ్వర సత్యసాయి దుర్గ మనోజ్ కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌ను శనివారం కలిశారు. ఈసందర్భంగా గౌతమ్ ఆయనను సత్కరించి మనోజ్ తల్లిదండ్రులను అభినందించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్నేహలత, అసిస్టెంట్ కలెక్టర్లు రాధికాగుప్త, మయాంక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

ఆధునికం.. సాంకేతికత

తెలంగాణ ఏర్పడ్డాక ప్రభుత్వం శాంతిభద్రతలకు ప్రాధాన్యత ఇస్తోంది. ఇందులో భాగంగానే జిల్లాలోనూ అత్యాధునిక పరికరాలు, సాంకేతికత మేళవింపుతో కేసుల దర్యాప్తు చురుగ్గా సాగుతుండగా, నిందితులకు శిక్ష పడుతోంది. తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం 'సురక్షా దినోత్సవ్' జరుపుకోనున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో పోలీసింగ్‌పై కథనం..

– ఖమ్మంక్రైం

- జిల్లాలో అత్యాధునిక పోలీసింగ్
- అత్యున్నత ప్రమాణాలతో కేసుల దర్యాప్తు
- సీసీ కెమెరాలతో అందుబాటులోకి నిఘా వ్యవస్థ

నేడు 'సురక్షా దినోత్సవ్'



పోలీసు కమిషనరేట్ కార్యాలయం

ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం

నేరాలు జరిగిన ప్రాంతాల్లో నిందితులు ఏ సమయాన ఎక్కడి నుంచి వచ్చారనేది గుర్తించడం గతంలో పోలీసులకు కష్టమయ్యేది. ప్రత్యక్ష సాక్షులు ముందుకు రాక, ఆధారాలు లభించక కేసు దర్యాప్తు ముందుకు సాగేది కాదు. కానీ సీసీ కెమెరాలు అందుబాటులోకి వచ్చాక దర్యాప్తులో పుటేజీ కీలకంగా మారుతోంది. ఈ నేపథ్యాన సీసీ కెమెరాల ఆవశ్యకతపై అన్ని వర్గాల ప్రజలకు వివరిస్తూ ఏర్పాటుచేసుకునేలా అవగాహన కల్పిస్తున్నారు. ఈ నేపథ్యాన జిల్లా వ్యాప్తంగా 8,500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్‌కు అనుసంధానం చేశారు. ఫలితంగా దొంగతనాలు, అల్లరిమూకల ఆగడాలు ఆట కట్టించడం, ఈవ్ టీజింగ్ నిర్మూలన సులువవుతోంది.

డయల్ 100, పెట్రోకార్లు

పోలీస్ వ్యవస్థ ఆధునికీకరణలో భాగంగా ప్రజలకు అత్యంత వేగంగా సేవలందించేందుకు ఖమ్మం కమిషనరేట్‌లో 31 పెట్రోకార్లు అందుబాటులోకి వచ్చాయి. అలాగే, 54 బ్లూ కోల్ట్స్, ఇతర వాహనాలు మొత్తం 400 వరకు సమకూరాయి. అలాగే, పోలీస్‌స్టేషన్లలో ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండేందుకు రిసెప్షన్ సెంటర్లు ఏర్పాటు చేశారు. ఇంకా డయల్ 100తో ఎక్కడ ఘటన జరిగినా పోలీసులు ఫిర్యాదు చేయడం సాధ్యమవుతోంది.

గంజాయి, గుడుంబాపై ఉక్కుపాదం

ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ జిల్లాను గుడుంబా రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నారు. ఇక జిల్లా మీదుగా గంజాయి రవాణాకు అడ్డుకట్ట వేసేలా నిరంతరం తనిఖీలు చేపడుతున్నారు. గంజాయి అక్రమ రవాణాకు సంబంధించి 160 కేసులు నమోదు చేసి 9వేల కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు చెబుతున్నారు.

మహిళల భద్రత, రక్షణ

మహిళల భద్రతలో భాగంగా ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేశారు. జిల్లాలో ఈ టీంల ద్వారా ఇప్పటి వరకు ఆపదలో ఉన్న 400మంది మహిళలను రక్షించినట్లు రికార్డులు చెబుతున్నాయి. ఇక జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రంతో పాటు అన్ని సబ్ డివిజన్లలో పోలీస్ షీ టీమ్స్ ఏర్పాటు, స్టేషన్లను సిటిజన్ ఫ్రెండ్లీగా తీర్చిదిద్దడం, మహిళ హెల్ప్‌డెస్కుల ఏర్పాటుతో మహిళకు భరోసా లభిస్తోంది.



భరోసా కార్యాలయ ప్రారంభోత్సవంలో సీపీ వారియర్ (ఫైల్)

సురక్షా దినోత్సవ్ ర్యాలీని విజయవంతం చేయాలి

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించే సురక్షా దినోత్సవ్ ర్యాలీని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని పోలీసు కమిషనర్ విష్ణు ఎస్.వారియర్ సూచించారు. కమిషనరేట్ కార్యాలయంలో అధికారులతో శనివారం సమావేశమైన ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ద్వారా రక్షణ, శాంతి భద్రతల పరిరక్షణకు తీసుకుంటున్న చర్యలను ప్రజలకు వివరించాలని తెలిపారు. జిల్లా కేంద్రంలోని సర్దార్ పటేల్ స్టేడియం నుండి శ్రీశ్రీ సర్కిల్ మీదుగా పాత బస్టాండ్ వరకు ర్యాలీ జరుగుతుందని చెప్పారు. అలాగే, సాయంత్రం జెడ్పీ సెంటర్ నుండి పోలీస్ బ్యాండ్‌తో మయూరి సెంటర్ వరకు పాదయాత్ర నిర్వహించనున్నామని, ఆతర్వాత పరేడ్ గ్రౌండ్స్‌లో తెలంగాణ సంప్రదాయాన్ని ప్రతిబింబించేలా కళాకారులతో ప్రదర్శనలు ఏర్పాటుచేశామని వివరించారు. ఈసమావేశంలో అడిషనల్ డీసీపీ సుభాష్‌చంద్రబోస్, ట్రెయినీ ఐపీఎస్ అవినాష్‌కుమార్, ఏసీపీలు రామోజీ రమేష్, గణేష్, ప్రసన్నకుమార్, వెంకటస్వామి పాల్గొన్నారు.

సైబర్ క్రైమ్‌లకు చెక్

సమాజంలో నానాటికీ పెరుగుతున్న సైబర్ నేరాల నియంత్రణకు సైబర్ ల్యాబ్ ఏర్పాటుచేశారు. ఎవరు కూడా ఇలాంటి సైబర్ నేరాల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు సైబర్ నేస్తం పేరిట సుమారు 1,200 వాట్సాప్ గ్రూప్‌లు ఏర్పాటుచేశారు. వీటి ద్వారా రోజుకు లక్ష మందికి సైబర్ నేరాలపై అవగాహన కల్పిస్తున్నట్లు అంచనా. ఇక సైబర్ ల్యాబ్ ఏర్పాటుతో దాదాపు రూ.1.15కోట్ల నగదును నేరస్తుల నుంచి బాధితులకు ఇప్పించారు. ఇంకా జిల్లాలో పోగొట్టుకున్న 200 సెల్ ఫోన్లను గుర్తించి యజమానులకు అప్పగించారు.



సైబర్ సెల్‌లో ఉద్యోగులు

మెగా జాబ్‌మేళా

జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యన నేరాలకు అడ్డుకట్ట వేయడమే కాక సామాజిక బాధ్యతగా పలు కార్యక్రమాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా సీపీ విష్ణు ఎస్.వారియర్ చొరవ తీసుకుని గతనెల 21న మెగా జాబ్‌మేళా ఏర్పాటుచేయించారు. ఈ మేళాకు 150 కంపెనీల ప్రతినిధులు హాజరుకాగా.. రిజిస్ట్రేషన్ చేయించుకున్న 10వేల అభ్యర్థుల్లో 8,025 మందికి ఉపాధి అవకాశాలు దక్కడం విశేషం.



గతనెల 21న పోలీసు శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన జాబ్‌మేళాలో రిజిస్ట్రేషన్ చేయించుకుంటున్న అభ్యర్థులు

రైతు పక్షపాతి.. రాష్ట్ర ప్రభుత్వం



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న మంత్రి పువ్వాడ, ఎంపీ నామా, కలెక్టర్ గౌతమ్ తదితరులు

- ఎక్కడా లేని విధంగా రైతుబంధు, బీమా
- రైతు దినోత్సవ వేడుకల్లో మంత్రి పువ్వాడ, ఎంపీ నామ

రఘునాథపాలెం: తెలంగాణలో ఉన్నది రైతు ప్రభుత్వమని.. అందుకే దేశంలోనే ఎక్కడా లేని విధంగా అన్నదాతలకు మేలు చేసేలా సీఎం కేసీఆర్ పథకాలు అమలుచేస్తున్నారని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా శనివారం రఘునాథపాలెం రైతు వేదిక, ఈర్లపూడి క్లస్టర్ రాంక్యా తాండాలో జరిగిన రైతు దినోత్సవ వేడుకల్లో ఎంపీ నామా నాగేశ్వరరావు, కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈసందర్భంగా పువ్వాడ మాట్లాడుతూ రైతుల ముఖంలో చిరునవ్వే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రైతుబంధు, రైతు బీమా, నాణ్యత విద్యుత్ సరఫరా, సాగునీటి ప్రాజెక్టులతో పంట సాగు విస్తీర్ణం, దిగుబడి గణనీయంగా పెరిగిందని తెలిపారు. తాజాగా అకాల వర్షాలతో పంట నష్టపోయిన జిల్లా రైతులకు ప్రభుత్వం రూ.23 కోట్ల పరిహారం విడుదల చేసిందని చెప్పారు.

కనీవినీ ఎరగని రీతిలో ప్రగతి

ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడ్డాక కనీవినీ ఎరగని రీతిలో అభివృద్ధి జరిగిందన్నారు. గతంలో వేసవి వస్తే తాగు, సాగునీరు, విద్యుత్ కోసం ఆందోళనలు జరిగేవని, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని తెలిపారు. కలెక్టర్ వీ.పీ.గౌతమ్ మాట్లాడుతూ రైతును రాజుగా చేసి వ్యవసాయాన్ని పండుగలా రాష్ట్ర ప్రభుత్వం మార్చిందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్టం జరగకుండా రోహిణి కార్తె లోపల సాగు పనులు మొదలుపెట్టాలని సూచించారు. అనంతరం వ్యవసాయానికి సంబంధించి రూపొందించిన పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించడమే కాక పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సదస్సులో జిల్లా వ్యవసాయ అధికారి విజయనిర్మల, జిల్లా సహకార అధికారి విజయకుమారి, ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ ప్రియాంక, కేవీకే శాస్త్రవేత్త హేమంత్‌కుమార్‌తో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు భూక్యా లక్ష్మణ్‌నాయక్, మందడపు సుధాకర్, శ్రీనివాసరావు, భాస్కరరావు, అజ్మీరా వీరూనాయక్, డాక్టర్ కిషోర్, తాతా రఘురాం, అఫ్జల్, మద్దినేని వెంకటరమణ, కుర్రా భాస్కర్‌రావు, పిన్ని కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనుల అండ ఉండగా నన్నేం చేయలేరు...

గిరిజనుల అండ ఉండగా కొత్త బిచ్చగాళ్లు, డబ్బుల మూటలతో ఏదైనా చేయొచ్చనుకునే వారు తననేమీ చేయలేరని మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వ్యాఖ్యానించారు. మాయ మాటలతో వచ్చే వారు తండాల్లో అడుగు పెట్టలేరని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని ఉద్దేశించి అన్నారు. నిన్నటి వరకు సీఎం కేసీఆర్‌ను అడ్డుపెట్టుకుని డబ్బు సంపాదించిన వారు ఇప్పుడు కేసీఆర్‌ను గెలవనివ్వమని, తనను అసెంబ్లీ గేటు దాటనిచ్చేది లేదని చెబుతున్నారని మండిపడ్డారు. అయితే, గిరిజనులు అండగా ఉన్నంత కాలం తననేమీ చేయలేరని తెలిపారు. గిరిజనులంతా కథానాయకులై రానున్న ఐదు నెలలు అప్రమత్తంగా ఉంటూ ఎదుటి వారి ఎత్తుగడలను చిత్తు చేయాలని కోరారు.

పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

జిల్లా జడ్జి జగ్జీవన్ కుమార్

ఖమ్మంలీగల్: ఈనెల 10న జరగనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా చూడాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి బీ.ఎస్.జగ్జీవన్‌కుమార్ సూచించారు. పోలీసు అధికారులు, న్యాయమూర్తులు, పీపీలతో శనివారం ఆయన సమావేశమై పలు సూచనలు చేశారు. పెండింగ్ కేసుల్లో సగమైనా లోక్‌అదాలత్‌లో పరిష్కారమయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాగా, కక్షిదారులకు అసౌకర్యం కలగకుండా ఈనెల 1నుంచే ముందస్తు లోక్ అదాలత్ ప్రక్రియ ప్రారంభించామని చెప్పారు. లోక్ అదాలత్ ద్వారా కలిగే ప్రయోజనాలను కక్షిదారులకు వివరించి రాజీకి ఒప్పించాలని, తెలంగాణ అవతరణ సంబరాల్లో లోక్ అదాలత్‌ను కూడా భాగం చేసి అధిక సంఖ్యలో కేసులు పరిష్కరించేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో అదనపు జిల్లా న్యాయమూర్తి రాంప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి మహమ్మద్ అబ్దుల్ జావేద్ పాషా, న్యాయమూర్తులు కె.దీప, ఆర్.శాంతిలత, వి.మాధవి, పీపీలు కృష్ణమోహన్, నరసయ్య, గంగామోహన్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా జడ్జి

మేలు చేసిన ప్రభుత్వాన్ని గుర్తుంచుకోండి

ఎమ్మెల్యే సండ్ర, ఎమ్మెల్సీ తాతా మధు

సత్తుపల్లి: వ్యవసాయాన్ని పండుగగా మార్చి రైతులకు మేలు చేసిన ప్రభుత్వాన్ని గుర్తుంచుకోవాలని ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ తాతా మధు పేర్కొన్నారు. సత్తుపల్లి మండలం కొత్తూరు రైతు వేదిక నుంచి బతుకమ్మలు, సీఎం కేసీఆర్ భారీ చిత్ర పటాలతో రైతులతో కలిసి కాకర్లపల్లి వరకు ట్రాక్టర్లతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ మాట్లాడుతూ రైతుల కోసమే కాక సకల జనుల కోసం ప్రభుత్వం పాటు పడుతోందని తెలిపారు. అనంతరం కాకర్లపల్లి రైతు వేదిక నిర్మాణానికి స్థల దానం చేసిన కంచర్ల సత్యనారాయణను సన్మానించారు. అలాగే, సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పటాలను నవధాన్యాలతో చిత్రించగా పరిశీలించారు. సర్పంచ్‌లు ఒగ్గు విజయలక్ష్మి, కంచర్ల రమాదేవి, ఎంపీపీ దొడ్డా హైమావతి, మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేష్, ఆత్మ చైర్మన్ వనమా వాసుతో పాటు మోదుగు పుల్లారావు, శీలపురెడ్డి హరికృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, ఏగోటి పెద్దరాజు, మల్లూరి అంకం రాజు, అద్దంకి అనీల్, చాంద్‌పాషా తదితరులు పాల్గొన్నారు.



నవధాన్యాలతో వేసిన సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలను పరిశీలిస్తూ..

ఖమ్మం తపాలా డివిజన్‌కు అవార్డులు

ఖమ్మంగాంధీచౌక్: తెలంగాణ తపాలా సర్కిల్ స్థాయిలో ఉత్తమ ప్రగతిని ప్రదర్శించిన ఖమ్మం తపాలా డివిజన్‌తో పాటు వివిధ విభాగాలకు అవార్డులు లభించాయి. సర్కిల్‌లోని 32 డివిజన్లలో ఖమ్మం డివిజన్ ఉత్తమంగా ఎంపికైంది. ఏడాది కాలంలో 1,33,942 సేవింగ్ అకౌంట్లు ప్రారంభించినందుకుగాను ఈఅవార్డు ప్రకటించారు. ఇదే విభాగంలో ఉత్తమ బ్రాంచి పోస్టాఫీస్‌గా కూసుమంచి మండలంలోని జక్కేపల్లి, స్పీడ్ పోస్టు బెస్ట్ మెయిల్ డెలివరీ అవార్డు ఖమ్మం హెడ్ పోస్టాఫీస్‌కు దక్కగా ఓవరాల్‌గా బెస్ట్ డివిజన్ అవార్డు కూడా ఖమ్మం డివిజన్‌కు గెలుచుకుంది. హైదరాబాద్‌లో మంగళవారం జరగనున్న సమావేశంలో ఖమ్మం పోస్టల్ డివిజన్ సూపరింటెండెంట్ బి.రవికుమార్, జక్కేపల్లి పోస్టుమాస్టర్ కె.సోమయ్య, హెడ్ పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ కె.కిరణ్‌కుమార్‌రెడ్డి ఈ అవార్డులు అందుకోనున్నారు.

14న వైద్య, ఆరోగ్య దినోత్సవం

ఖమ్మం వైద్యవిభాగం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 14న వైద్య, ఆరోగ్య దినోత్సవ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి.మాలతి తెలిపారు. ఈసందర్భంగా కలెక్టరేట్‌లో శనివారం ఆమె వైద్యాధికారులతో సమావేశమై మాట్లాడారు. ప్రతీ ఆస్పత్రిలో పండగ వాతావరణం ఉట్టిపడేలా అలంకరించి కార్యక్రమాలు నిర్వహిస్తామని, ఆయా సెంటర్ల పరిధిలో సాధించిన పురోగతిని ప్రజలకు వివరిస్తామని తెలిపారు. అలాగే, కంటి వెలుగు, ఆరోగ్య మహిళ, కేసీఆర్ కిట్ లబ్ధిదారులను పిలిపించి మిగతా వారికి అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. కాగా, వైద్యాధికారులు తమ పరిధిలో ఉత్తమ ఆశ, ఏఎన్‌ఎం, ఎల్‌టీ, ఫార్మసిస్టులు, స్టాఫ్‌నర్సు, వైద్యాధికారిని ఎంపిక చేసి డిప్యూటీ డీఎంహెచ్‌ఓల ద్వారా నివేదిక పంపించాలని సూచించారు. ఇంకా ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓలు రాంబాబు, సీతారాం, డీటీసీఓ సుబ్బారావు, డీఎల్‌ఓ ప్రవీణ, డీఐఓ ప్రమీల, డాక్టర్ సైదులు, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ మాలతి

8నుంచి ఫిష్ ఫుడ్ ఫెస్టివల్



ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఈనెల 8 నుంచి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న ఫిష్ ఫుడ్ ఫెస్టివల్‌ను విజయవంతం చేయాలని జిల్లా మత్స్యశాఖ అధికారి ఆంజనేయస్వామి కోరారు. ఖమ్మం లకారం ట్యాంక్ బండ్ వద్దే కాక మండలాలు, గ్రామాల్లోనూ వేడుకలు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. చెరువుల వద్ద గంగమ్మ తల్లి, కట్ట మైసమ్మ తల్లికి పూజలు చేయటంతో పాటు సభలు, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, బతుకమ్మ ఆట, కోలాటాలు ఉంటాయని వివరించారు.

రేపు ఆధార్ సేవల క్యాంప్

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మంలోని గాంధీచౌక్, పాత కలెక్టరేట్(జిల్లా పరిషత్ కార్యాలయం) బ్రాంచ్ పోస్టాఫీసుల్లో సోమవారం ఆధార్ సేవల మెగా క్యాంపు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా ఆధార్ కార్డులో దొర్లిన తప్పుల సవరణ, ఇతర వివరాల నమోదు చేయనున్నారు. అవసరమైన ఆధారాలు, ధృవీకరణ పత్రాలతో ఆయా పోస్టాఫీస్‌లకు వెళ్తే తప్పులు సరిచేయించుకోవచ్చని తపాలా శాఖ అధికారులు వెల్లడించారు.

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్య కల్యాణ వేడుకను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. వారాంతపు సెలవు రోజులు కావడంతో భక్తులు పెద్ద ఎత్తున ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు.

ఎంపీ, మాజీ ఎంపీ కరచాలనం!



కరచాలనం చేసుకుంటున్న నామా, పొంగులేటి

మండలంలోని రామకృష్ణాపురంలో శనివారం జరిగిన ఓ వివాహ వేడుకకు హాజరయ్యేందుకు ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు సర్పంచ్ కన్నెబోయిన కుటుంబరావు ఇంటికి వచ్చారు. అదే సమయాన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కూడా రావడంతో ఎదురుపడిన ఇద్దరు కరచాలనం చేసుకున్నారు. ఇటీవల బీఆర్‌ఎస్‌తో విబేధించిన పొంగులేటి ఆ పార్టీ నేతలపై విమర్శలు చేస్తున్న నేపథ్యాన ఎంపీ, మాజీ ఎంపీ కరచాలనం చేసుకోవడాన్ని పలువురు ఆసక్తిగా తిలకించారు.

– చింతకాని

క్లుప్తంగా

మహిళల ఫుట్‌బాల్ జట్టుకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న మంత్రి, కలెక్టర్, సీపీ

ఖమ్మం స్పోర్ట్స్: ఇటీవల హైదరాబాద్‌లో జరిగిన రాష్ట్రస్థాయి సీఎం కప్ పోటీల్లో జిల్లా మహిళల ఫుట్‌బాల్ జట్టు టైటిల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా జట్టు సభ్యులను మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ అభినందించారు. డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి, కోచ్‌లు ఎం.డీ.గౌస్, ఎం.డీ.అక్బర్ అలీ, ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కె.ఆదర్శ్ కుమార్ పాల్గొన్నారు.

డీఆర్‌డీఓ సైంటిస్ట్‌గా పెనుబల్లివాసి



చెన్ను నరేష్

పెనుబల్లి: పెనుబల్లి మండలం రామచందర్‌రావు బంజర్ గ్రామానికి చెందిన చెన్ను నరేష్ బెంగళూరు డీఆర్‌డీఓలో సైంటిస్ట్‌గా ఎంపికయ్యాడు. గ్రామానికి చెందిన పేద రైతు కుటుంబమైన చెన్ను రామయ్య – లక్ష్మి దంపతుల కుమారుడు నరేష్ బీటెక్ పూర్తి చేసి 2013లో డీఆర్‌డీఓలో టెక్నికల్ ఆఫీసర్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈ ఏడాది నిర్వహించిన ప్రవేశపరీక్షలో అర్హత సాధించడమే కాక ఇంటర్వ్యూ మూడు దశల్లో ప్రతిభ కనబరిచిన ఆయనను బెంగుళూరు డీఆర్‌డీఓలో సైంటిస్ట్‌గా ఎంపిక చేసినట్లు శనివారం సమాచారం అందింది. దీంతో నరేష్‌ను గ్రామస్తులు అభినందించారు.

రైల్వే శాఖ నిర్లక్ష్యంతోనే ప్రమాదం

ఖమ్మంమయూరిసెంటర్: ఒడిశాలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి రైల్వే శాఖ తీవ్ర నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యమే కారణమని సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. వందల మంది చేయాల్సిన పనిని పదుల మందితో చేయిస్తుండగా, శ్రమ దోపిడియే ప్రమాదానికి కారణమైందని పేర్కొన్నారు. ఘటనలో మృతి చెందిన వారి కుటుంబాలకు రూ.కోటి, తీవ్రంగా గాయపడ్డ వారికి రూ.25 లక్షల పరిహారం చెల్లించడమే కాక బాధ్యతగా రైల్వే మంత్రి, రైల్వే ఉన్నతాధికారులు రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఎగ్జిట్ పాయింట్ కోసం రైతుల ధర్నా



ధంసలాపురం వద్ద ధర్నా నిర్వహిస్తున్న రైతులు

చింతకాని: ఖమ్మం కార్పొరేషన్ పరిధి ధంసలాపురం, మండలంలోని రామకృష్ణాపురం గ్రామాలకు చెందిన రైతులు గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారి పనుల వద్ద శనివారం ధర్నాకు దిగారు. దేవరపల్లి నుంచి సూర్యాపేట వరకు నిర్మిస్తున్న గ్రీన్‌ఫీల్డ్ జాతీయ రహదారికి ధంసలాపురం వద్ద ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలనే డిమాండ్‌తో వారు ఆందోళన చేపట్టారు. ఖమ్మం నుంచి విజయవాడ వరకు నిత్యం వేలాది మంది ఈ రహదారి మీదుగా ప్రయాణిస్తున్నందున ఎగ్జిట్ పాయింట్ ఇవ్వాలని డిమాండ్ చేస్తూ వాహనాలను అడ్డుకున్నారు. దీంతో స్పందించిన ప్రాజెక్ట్ మేనేజర్ సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇవ్వటంతో ధర్నాను విరమించారు.

మనస్తాపంతో యువకుడు ఆత్మహత్య

నేలకొండపల్లి: పలువురి దూషించారనే మనస్తాపంతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. మండలంలోని పైనంపల్లికి చెందిన కుక్కల గురుస్వామి(23)ని గ్రామానికి చెందిన పలువురు మూడు రోజుల క్రితం తిట్టి అవమానించారు. దీంతో మనస్తాపానికి గురైన ఆయన మామిడి తోటలో చెట్టుకు ఉరేసుకున్నాడు. ఆయన మృతదేహాన్ని శనివారం గుర్తించగా తండ్రి రామయ్య ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు ఎస్సై స్రవంతి తెలిపారు.

పురుగుల మందు తాగి యువకుడి...

బూర్గంపాడు: పురుగుల మందుతాగి చికిత్స పొందుతున్న యువకుడు శనివారం మృతిచెందాడు. మండలంలోని కృష్ణసాగర్ గ్రామానికి చెందిన హరిశ్చంద్రప్రసాద్(22) ఈ నెల 2వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబసభ్యులు భద్రాచలం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి తండ్రి శ్రీను ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.14,205

వ్యవసాయ రంగానికి పెద్దపీట

- ఖమ్మం ఎంపీ నామ నాగేశ్వరరావు
- రైతు దినోత్సవంలో సహపంక్తి భోజనాలు



బోనకల్ : రాయన్నపేటలో రైతులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీ నాగేశ్వరరావు, తదితరులు

బోనకల్/చింతకాని: రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి పెద్దపీట వేస్తోందని ఖమ్మం ఎంపీ నామా నాగేశ్వరరావు తెలిపారు. బోనకల్, చింతకాని మండలాల్లో శనివారం జరిగిన రైతు దినోత్సవ వేడుకల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, రైతుబంధు సమితి జిల్లా కన్వీనర్ నల్లమల్ల వెంకటేశ్వరరావుతో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ ఇది రైతు ప్రభుత్వమని, రైతుల కోసం అనేక పథకాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించేందుకు సీఎం కేసీఆర్ రైతుబంధు పథకం ద్వారా ఏటా ఎకరానికి రూ.10 వేల పెట్టుబడి సాయం, రైతు మరణిస్తే వారి కుటుంబానికి రైతుబీమా ద్వారా రూ.5 లక్షల సాయం అందిస్తుండగా, వ్యవసాయానికి 24 గంటల ఉచిత విద్యుత్, రుణమాఫీ అమలుచేస్తున్నారని చెప్పారు. కాగా, పలు రైతు వేదికల్లో జరిగిన సభల్లో రైతులకు జీలుగు విత్తనాలు పంపిణీ చేశారు. కాగా, ర్యాలీల్లో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ట్రాక్టర్ నడిపారు. ఈసభల్లో జెడ్పీటీసీ సభ్యుడు పర్చగాని తిరుపతి కిషోర్, ఎంపీపీ కోపూరి పూర్ణయ్య, ఎంపీడీఓలు వేణుమాధవ్, శ్రీనివాసరావు, ఎంపీఓ మల్లెల రవీంద్రప్రసాద్, తహసీల్దార్ మంగీలాల్, ఏఓలు శరత్‌బాబు, పల్లెల నాగయ్యతో పాటు అధికారులు, ప్రజాప్రతినిధులు వేమూరి ప్రసాద్, గురిజాల హన్మంతరావు, పానుగోటి రత్నాకర్, మంకెన రమేష్, తిరుమలరావు, పెంట్యాల పుల్లయ్య, నెల్లూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మిర్చి, మొక్కజొన్నలతో రైతు దినోత్సవం

ఖమ్మంవ్యవసాయం: తెలంగాణ అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం రైతు దినోత్సవ వేడుకలు ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో జరిగాయి. మార్కెట్‌కు వేసవి సెలవులు ఉండగా, మార్కెట్ కమిటీ, ఉద్యోగుల ఆధ్వర్యాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా మిర్చి, మొక్కజొన్నలతో 'రైతు దినోత్సవం' అని రాసి శుభాకాంక్షలు తెలిపారు. మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం, వైస్ చైర్మన్ షేక్ అఫ్జల్‌తో పాటు సుందర్ సూర్య, బి.బజార్, సోమా నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.



మిర్చి, మొక్కజొన్నతో రాసిన అక్షరాలు

రైతు వేదికలను సందర్శించిన కలెక్టర్

కామేపల్లి(కారేపల్లి)/కొణిజర్ల: తెలంగాణ అవతరణ దశాబ్ది వేడుకల్లో భాగంగా శనివారం రైతు వేదికల్లో రైతు దినోత్సవాన్ని నిర్వహించగా కలెక్టర్ వీ.పీ.గౌతమ్ పలు చోట్ల పరిశీలించారు. కామేపల్లి రైతు వేదిక వద్ద ఉత్సవాలను పరిశీలించిన ఆయన అధికారులకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కోట రవికుమార్ పాల్గొన్నారు. అలాగే, కొణిజర్ల మండలం తనికెళ్ల, కొణిజర్ల రైతు వేదికల్లో జరిగిన రైతు దినోత్సవ వేడుకల ఏర్పాట్లను కలెక్టర్ గౌతమ్ పరిశీలించారు. రైతులు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లపై సూచనలు చేసిన ఆయన భోజనాల నాణ్యతపై ఆరా తీశారు. మండల ప్రత్యేకాధికారి ఎం.పరంధామరెడ్డి, ఎంపీడీఓ ఆర్.రమాదేవి, తహసీల్దార్ డి.సైదులు తదితరులు పాల్గొన్నారు.

రైతులు ఎక్కడా?

కారేపల్లి: రైతు దినోత్సవం నిర్వహిస్తుండగా రైతులు రాకపోవడంపై అదనపు కలెక్టర్ స్నేహలత అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. కారేపల్లి మండలం రొట్టమాకురేవు, అప్పాయిగూడెం రైతు వేదికలను ఆమె పరిశీలించగా ఉదయం 9గంటలు కావొస్తున్నా రైతులు రాలేదు. దీంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేయడంతో గ్రామ కార్యదర్శులు ఉరుకులు పరుగులపై పది గంటకల్లా రైతులను రప్పించారు. అలాగే, కామేపల్లి మండలం కొమ్మినేపల్లి రైతు వేదికను కూడా అదనపు కలెక్టర్ సందర్శించారు.



కారేపల్లి : అప్పాయిగూడెంలో రైతులు లేకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్న అదనపు కలెక్టర్ స్నేహలత

అధికారులను నిలదీసిన రైతులు

పొన్నెకల్ రైతువేదికలో ఘటన

ఖమ్మంరూరల్: మండలంలోని పొన్నెకల్ రైతువేదికలో శనివారం నిర్వహించిన రైతు దినోత్సవంలో అధికారులను రైతులు నిలదీశారు. తల్లంపాడు, పొన్నెకల్, మద్దులపల్లి, నర్సింహాపురం, కొండాపురానికి చెందిన రైతులు మొక్కజొన్న సాగు చేయగా, పంట వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేసే విషయమై అధికారులు కాలయాపన చేశారని ఆరోపించారు. ఫలితంగా అమ్మకాల సమయాన కూపన్లు అందక ఇబ్బంది పడ్డామని వాపోయారు. వ్యవసాయ అధికారుల తప్పిదంతో మక్కను ప్రైవేట్ వ్యాపారులకు అమ్ముకుని నష్టపోవాల్సి వచ్చిందని చెప్పారు. దీంతో కల్పించుకున్న జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారి, మండల ప్రత్యేకాధికారి జ్యోతి సముదాయించడంతో రైతులు శాంతించారు. అనంతరం రైతులకు అవగాహన కల్పించేలా రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు. తొలుత రైతువేదికను అదనపు కలెక్టర్ మధుసూదన్ సందర్శించారు. తహసీల్దార్ టి.సుమ, ఏడీఏ విజయ్‌చంద్ర, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

జీఎస్టీ, ఇన్‌కం ట్యాక్స్‌పై సెమినార్

ఖమ్మంగాంధీచౌక్: వస్తు సేవా పన్ను, ఆదాయ పన్నుల విధివిధానాలపై ఖమ్మంలో శనివారం సెమినార్ నిర్వహించారు. ఈసందర్భంగా చార్టర్డ్ అకౌంటెంట్ కొమ్మురాజు శిరీష్‌కుమార్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఆతర్వాత జీఎస్టీ చట్టంలోని ఆర్‌సీఎం(రివర్స్ చార్జ్), ఐటీసీల వివరాలను మరో సీఏ ఆశిష్‌కుమార్ అగర్వాల్ వివరించారు. జిల్లా జీఎస్టీ ప్రొఫెషనల్ అసోసియేషన్, ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్(సౌత్ జోన్), తెలంగాణ ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అసోసియేషన్ హైదరాబాద్, ఏపీ ట్యాక్స్ బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఈ సెమినార్‌లో ఖమ్మం, నల్లగొండ, వరంగల్, విజయవాడకు చెందిన పలువురు హాజరయ్యారు. రిటైర్డ్ జాయింట్ కమిషనర్ పీ.వీ.సుబ్బారావు, జీఎస్టీ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు బూర్గుల దుర్గా ప్రసాద్‌రావు, అధ్యక్షుడు రామకృష్ణతో పాటు వి.సైదులు, కె.పవన్‌కుమార్, జి.రమేష్, ఏ.శ్రీనివాస్‌రావు పాల్గొన్నారు.



రిటైర్డ్ జాయింట్ కమిషనర్ సుబ్బారావును సత్కరిస్తున్న ప్రతినిధులు

రైతు సమస్యలను గాలికొదిలేసి సంబరాలా?

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

బోనకల్/చింతకాని: రైతుల సమస్యలను గాలికొదిలేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాల పేరిట రైతు దినోత్సవం జరపడం గర్హనీయమని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ మండిపడ్డారు. బోనకల్ మండలం రామాపురం, చింతకాని మండలం పాతర్లపాడు కాంగ్రెస్ ఆధ్వర్యాన చేపట్టిన పోస్టుకార్డుల ఉద్యమాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్ మాట్లాడుతూ ఎన్నికల హామీలో భాగంగా రైతుల రుణాలను ప్రభుత్వం తక్షణమే మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రైతులు తీసుకున్న రుణాల్లో రూ.లక్ష వరకు మాఫీ చేస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ కాలయాపన చేస్తున్నారని ధ్వజమెత్తారు. ఓపక్క రైతులను మోసం చేస్తూ, మరోక్క రైతు దినోత్సవం నిర్వహించడం ఏమిటని ప్రశ్నించారు. రైతుల రుణాల వివరాలతో పోస్టుకార్డులు సీఎం కేసీఆర్‌కు పంపిస్తున్నట్లు తెలిపారు. ధాన్యం, మొక్కజొన్న పంటల కొనుగోళ్లు పూర్తిచేయడంతో పాటు రైతులకు డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈకార్యక్రమాల్లో పీసీసీ సభ్యుడు పైడిపల్లి కిషోర్, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు మొక్కా శేఖర్‌గౌడ్, నాయకులు గాలి దుర్గారావు, కర్నాటి రామకోటేశ్వరరావు, నల్లమోతు సత్యనారాయణ, జమాలుద్దీన్, రామకృష్ణ, భద్రు, కొప్పుల గోవిందరావు, అంబటి వెంకటేశ్వర్లు, మద్ది వీరారెడ్డి, బొర్రా శేషగిరిరావు, మద్దినేని నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



బోనకల్ : రామాపురంలో పోస్టుకార్డు ఉద్యమాన్ని ప్రారంభిస్తున్న డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్

పరిపాలన దిశగా అడుగులు వేయాలి

- పార్టీల జెండాలు మోయడాన్ని ఇకనైనా ఆపేయాలి
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ

తల్లాడ: అణగారిన వర్గానికి చెందిన మాదిగ జాతి బిడ్డలు పార్టీల జెండాలు మోయడం ఇకనైనా ఆపేసి సొంత పార్టీని బలోపేతం చేసుకొని పరిపాలన దిశగా అడుగులు వేయాలని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. తల్లాడలో శనివారం రాత్రి జరిగిన ఉమ్మడి జిల్లా స్థాయి సదస్సులో ఆయన మాట్లాడారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లయినా మాదిగ జాతికి సముచిత స్థానం దక్కలేదన్నారు. రాష్ట్రంలో 19 శాతం ఉన్న మాదిగలు అంత కంటే తక్కువగా ఉన్న వారితో పోలిస్తే విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో వెనుకబడ్డారని తెలిపారు. వర్గీకరణతో కొంత మేర ఉద్యోగాలు దక్కినా, తొలగించాక మళ్లీ అన్యాయమే జరుగుతోందన్నారు. ఏపీలోని తిరుపతిలో గత ఏప్రిల్‌లో జరిగిన ఎమ్మార్పీఎస్ జాతీయ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ కోసం ఉద్యమాన్ని బలోపేతం చేయాలని నిర్ణయించినట్లు ఆయన చెప్పారు. ఈమేరకు యాభై రోజుల పాటు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి మాదిగలను చైతన్యవంతం చేయాలని సూచించారు. రాజకీయంగా సత్తా చాటేందుకు స్థాపించిన మహాజన సోషలిస్టు పార్టీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషి చేయాలని మంద కృష్ణ పిలుపునిచ్చారు. తెలంగాణ ఒక శాతమే ఉన్న కేసీఆర్ వర్గమే పదవులు అనుభవిస్తుండగా, కాంగ్రెస్, బీజేపీలు సైతం వర్గీకరణ విషయంలో మోసం చేశాయని ఆరోపించారు. తొలుత తల్లాడలో మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించగా, రింగ్ రోడ్డు సెంటర్‌లో జెండాను ఆవిష్కరించారు. ఈ సభలో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కూరపాటి సునీల్, నాయకులు ఏపూరి వెంకటేశ్వరరావు, కొలికపోగు వెంకటేశ్వర్‌రావు, బచ్చలకూర వెంకటేశ్వర్లు, బొర్రా బిక్షపతి, తాళ్ల సురేష్, ఎక్కిరాల నాగరాజు, గొడ్ల మంగమ్మ, దారెల్లి వెంకటేశ్వరరావు, కోట బలరాం, ఇస్నేపల్లి అశోక్, రజిత, మాచర్ల క్రాంతి, కంచెపోగు సురేష్ పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న మంద కృష్ణ, పక్కన నాయకులు

'సుడా' పార్కు నిర్వహణపై మంత్రి ఆరా

పరిశీలించిన సూచనలు చేసిన కలెక్టర్

సాక్షి ఎఫెక్ట్..

రఘునాథపాలెం: రఘునాథపాలెంలో రూ.కోట్లు వెచ్చించి నిర్మించిన సుడా పార్క్ నిర్వహణ లోపంతో మొక్కలు ఎండిపోతుండగా, నిర్మాణాలు శిథిలమవుతున్నాయి. ఈ విషయమై 'ఏడాది లోపే ఎండపెట్టేశారు' శీర్షికన 'సాక్షి'లో కథనం ప్రచురితం కాగా మంత్రి అజయ్‌కుమార్ స్పందించారు. మండల పర్యటనకు శనివారం వచ్చిన ఆయన పార్కు నిర్వహణపై ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరా తీయడమే కాక ఒక్క మొక్క ఎండిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సుడా చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, సంబంధిత అధికారులకు సూచించారు. ఆ వెంటనే కలెక్టర్ గౌతమ్ పార్కును సందర్శించి నిర్వహణపై చర్చించారు. అలాగే, పార్కులోని మినీ ట్యాంక్ బండ్, ఆ పక్కనే నిర్మాణంలో ఉన్న స్కూల్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ బాలుర పాఠశాల, కళాశాలల నిర్మాణ పనులపై ఆరా తీశారు. తహసీల్దార్ నర్సింహారావు, గ్రామ కార్యదర్శులు శ్రీనివాస్‌కుమార్, అంజయ్య తదితరులు పాల్గొన్నారు.



పార్కులో పరిశీలిస్తున్న కలెక్టర్ గౌతమ్

తెలంగాణ జట్టు జైత్రయాత్ర

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరుగుతున్న ఆల్ ఇండియా మహిళా టీ-20 క్రికెట్ టోర్నీలో తెలంగాణ జట్టు జైత్రయాత్ర సాగిస్తోంది. ఈమేరకు శనివారం తెలంగాణ- ఆంధ్రప్రదేశ్ జట్ల జరిగిన మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న ఏపీ జట్టు పరిమిత 20 ఓవర్లలో 103 పరుగులకు ఆరు వికెట్లు కోల్పోయింది. జట్టులో యుహాసిని ఏడు ఫోర్లతో 54 పరుగులు, తనిష్క 15, సునీత 10 పరుగులు చేశారు. అనంతరం బరిలోకి దిగిన తెలంగాణ జట్టు 16 ఓవర్లలో నాలుగు వికెట్ల నష్టానికి లక్ష్యాన్ని ఛేదించింది. జట్టులో చందన 46 బంతులు ఎదుర్కొని 51 పరుగులు చేయగా, నవీన 21, అంజలి పది పరుగులు చేశారు. రెండో మ్యాచ్‌లో కర్ణాటక- తమిళనాడు జట్లు తలపడగా తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న తమిళనాడు జట్టు 16.3 ఓవర్లు ఆడి 92 పరుగులు చేసింది. తర్వాత బ్యాటింగ్ చేపట్టిన కర్ణాటక జట్టు 13 ఓవర్లనే లక్ష్యాన్ని సాధించింది. తొలుత మ్యాచ్‌లను ప్రారంభించిన డీవైఎస్‌ఓ ఎం.పరంధామరెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాల్లో ముందు నిలవాలని ఆకాంక్షించారు. టోర్నీ చైర్మన్ డాక్టర్ కూరపాటిప్రదీప్‌కుమార్, ఎం.డీ.మతిన్, రమణ, సందీప్ ఆర్య పాల్గొన్నారు.



క్రికెటర్లను పరిచయం చేసుకుంటున్న డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి

అండర్–14 ఫుట్‌బాల్ విజేత వీ.వీ.పాలెం



అండర్-14 విజేత వీ.వీ.పాలెం జట్టుకు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు



అండర్-10 విజేత ఖమ్మం జట్టుకు బహుమతి అందజేస్తున్న దృశ్యం

ఖమ్మం స్పోర్ట్స్: ఫుట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యాన నిర్వహించిన ఉమ్మడి జిల్లాస్థాయి ఫుట్‌బాల్ అండర్-14 పోటీల్లో విజేతగా వీ.వీ.పాలెం జట్టు నిలిచింది. అలాగే, రన్నరప్‌గా ఇల్లెందు జట్టు నిలవగా, అండర్-10 విభాగంలో ఖమ్మం జట్టు విజేతగా, వీ.వీ.పాలెం జట్టు రన్నరప్ ట్రోఫీని కైవసం చేసుకుంది. పోటీలకు ఉమ్మడి జిల్లా నుంచి అండర్-14 విభాగంలో 11 జట్లు, అండర్-10లో ఏడు జట్లు పాల్గొన్నాయి. ఫుట్‌బాల్ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కే.ఈ.సెల్యూకాస్, కె.ఆదర్శ్‌కుమార్‌తో పాటు టీ ఎఫ్ ఏ మెంబర్ జి.వేణు, కిషోర్, రమణ, శ్రీనివాస్, మోహన్, రాకేష్, మధు, ప్రేమ్, మహేష్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఇన్నోవేషన్ చాలెంజ్‌కు ఎంపిక

రఘునాథపాలెం: విద్యార్థుల్లో దాగి ఉన్న నైపుణ్యాలను వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ ఇన్నోవేషన్ చాలెంజ్ పేరిట ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. ఇప్పటికే జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో తాము రూపొందించిన ఎగ్జిబిట్లను ప్రదర్శించారు. ఇలా రాష్ట్రవ్యాప్తంగా 13వేల మంది తమ ఆలోచనలను పంచుకోగా 70 ప్రదర్శనలను రాష్ట్రస్థాయికి ఎంపిక చేశారు. ఇందులో రఘునాథపాలెంకు చెందిన తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాల విద్యార్థులు వేదశ్రీ, తక్లూమ్, మౌనిక, అమీన అఫ్రోజ్ రూపొందించిన హెల్మెట్ విత్ వైపర్స్ ఎగ్జిబిట్‌కు స్థానం దక్కింది. ఈమేరకు విద్యార్థులను డీఈఓ సోమశేఖరశర్మ, సైన్స్ ఆఫీసర్ సైదులు, ఎంఈఓ శ్రీనివాస్, పాఠశాల హెచ్ఎం అబీదా, ఉపాధ్యాయులు అభినందించారు.